క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

27 నుంచి మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: ఈ నెల 27వ తేదీ నుంచి మండలంలోని వివిధ ఆలయాల మాన్యం కౌలుకు వేలాలు నిర్వహిస్తామని కోటపాడు గ్రూప్ ఈఓ వేణునాథరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 27వ తేదీన చెన్నూరు, శిరివెళ్లలో బహిరంగ వేలం పాటలు జరుగుతాయన్నారు. 29న బోయలకుంట్ల, కామినేనిపల్లె ఆలయాల భూముల కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఆలయాలకు బకాయాలున్న వారు పాటలకు అనర్హులని చెప్పారు. నిర్ధేశించిన డిపాజిట్లను చెల్లించి పాటలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



టిడ్కో ఇళ్ల సముదాయంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ: అపరిచితులు, అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ సూచించారు. పట్టణ శివారులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాంప్లెక్స్‌లో ఎవరైనా అపరిచితులు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు తెలిపారు. ఆశ్రయం ఇచ్చినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో స్కూల్ పేరుతో ముద్రించిన పుస్తకాలను వేల రూపాయలకు కార్పొరేట్ విద్యాసంస్థలు అమ్ముకుంటున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు జోరుగా సాగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. షాహిద్, వినోద్, బాలాజీ, హరికృష్ణ, వంశీ, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువైన పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో వేద పండి తులు ఉదయాన్నే మూల విరాట్‌కు నిత్యపూజలు గావించారు. అనంతరం భిషేకం ,అర్చన,అలంకారం వంటివి పూర్తి చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

మహానంది: బుక్కాపురం రైస్ మిల్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్ నారాయణకు చెందిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ గాలి తీవ్రంగా ఉండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు నంద్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేశారు. సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. బియ్యం బస్తాలు, దుస్తులు, రూ.పది వేల నగదు కాలిపోయిందని, సుమారు రూ. 50వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

లెక్కలేస్తున్నారహో..

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- గ్రామాల వారీగా లెక్కలతో కుస్తీ పడుతున్న నాయకులు
- ఎక్కడ చూసినా అదే చర్చ



పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు (ఫైల్)

దొర్నిపాడు: మండలంలో పోలింగ్ సరళి అందరినీ ఆశ్చర్య పరిచింది. ఫలితాల వెల్లడవడానికి ఇంకా..15 రోజుల సమయం ఉండటంతో గెలుపుపై ఆయా పార్టీల నాయకులు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఓటర్లు మాత్రం తమ తీర్పును ఈవీఎంలలో వారి భవితను భద్రపరిచారు. ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి...మనకు ఎన్ని వస్తాయని జాబితాను ముందరేసుకొని లెక్కలేసుకుంటున్నారు. ఏ ఏ గ్రామాల్లో తమకు బలముందో చూసుకుంటూ ఎక్కడ తమకు లీడ్ వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీ నాయకులంతా ఇలా లెక్కలేసుకుంటూ తమ పార్టీ అభ్యర్థి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడి మాత్రం ఇంకా తగ్గలేదు. నలుగురు గుమికూడిన చోట ఫలితాలు, మెజార్టీపైనే జోరుగా చర్చ సాగుతోంది. సామాజిక వర్గాల ప్రకారం ఎవరు, ఏ పార్టీవైపు మొగ్గు చూపారనే చర్చ నడుస్తోంది.

మండలంలో పోలింగ్ తీరు ఇలా..

గ్రామం	పీఎస్ నంబర్	మొత్త ఓటర్లు	పురుషులు	మహిళలు	పోలైన ఓట్లు	శాతం
గుండుపాపల	1	898	397	399	796	89.00
	2	434	210	194	404	93.08
ఉమాపతినగరం	3	393	168	184	352	89.56
క్రిష్టిపాడు	4	811	319	361	680	83.84
	5	814	349	354	703	86.36
అమ్మిరెడ్డినగరం	16	627	279	283	562	89.63
బుర్రారెడ్డిపల్లె	17	908	370	408	778	85.68
	18	491	210	222	432	87.98
డబ్ల్యూ గోవిందిన్నె	19	1,009	436	392	828	82.06
	20	975	431	430	861	88.30
డబ్ల్యూ కొత్తపల్లె	21	846	384	321	705	87.30
	22	893	379	348	727	81.40
చాకరాజువేముల	27	838	340	370	710	84.70
	28	1,091	515	440	955	87.50
వెంకటేశ్వరనగరం	29	255	112	103	215	84.31
చాకరాజువేముల	30	788	332	312	644	81.72
	31	621	289	265	554	89.21
అర్జునాపురం	32	749	333	319	652	87.04
దొర్నిపాడు	33	1,282	529	580	1109	86.50
	34	890	391	362	753	84.60
	35	1,051	436	392	831	79.16
	36	1,310	543	528	1,071	81.75
కొండాపురం	37	623	280	273	553	88.7
భాగ్యనగరం	38	513	209	239	448	87.30
రామచంద్రాపురం	39	711	294	316	610	85.79
	40	557	231	241	472	84.50
	26(పోలింగ్ స్టేషన్లు)	20,378	8,766	8,636	17,402	85.39

సమాజాభివృద్ధికి విద్య ఎంతో అవసరం



చాగలమర్రి మక్తబ్ జామియా మస్జీద్‌లో ఖురాన్ ప్రశస్త్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, గ్రామస్తులు

చాగలమర్రి: సమాజాభివృద్ధికి విద్య ఎంతో అవసరమని నెల్లూరు పట్టణానికి చెందిన ఇస్లాం మత పెద్దలు మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ రషాదీ ఖాస్మీ అన్నారు. ఆదివారం స్థానిక జామియా మస్జీద్‌లో నిర్వహించిన అరబ్బీ మదరాసా వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మక్‌తబ్ జామియా మదరసా నిర్వాహకులు, జామియా మస్జీద్ ఇమాం హఫీజ్ సులేమాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఖురాన్ ప్రవచనాలు, ఇస్లాం పద్ధతులు, ప్రవక్త జీవితం, ఇస్లాం మత వ్యాప్తికి ఏ విధంగా పాటు పడ్డాడు అనే అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, గ్రూప్ డిస్కషన్ పోటీలు నిర్వహించి గెలుపొదిన 40 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మౌలానా ముఫ్తీ అబ్దుల్ హాది సాహెబ్, మిస్తాహి వ ఖాస్మీ, మౌలానా ముఫ్తీ ఖలీలుల్ రెహమాన్ సాహెబ్ వ మిస్తాహి ఓ ఖాస్మీ, మౌలానా అబ్దుల్ మజీద్ సాహెబ్ బాఖవీ, స్థానిక మౌల్వీలు ఖలీల్, అబ్దుల్ సలాం, మేహబుబ్, గౌస్, అబ్దుల్ సుబహాన్ పాల్గొన్నారు.

సీమ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి



నీలంసంజీవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, కేంద్ర మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నో పదవులను అలంకరించి ఎలాంటి హంగు, ఆర్భాటాలు చూపని రాయలసీమ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి అని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కొనియాడారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నీలం సంజీవరెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అసోసియేషన్ నాయకులు నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, నబిరసూల్, సభ్యులు ఆరీఫ్, ముస్తఫా పాల్గొన్నారు.

నేడు పాండురంగడి కల్యాణం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున చిత్తా నక్షత్రమున స్వామివారి కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు జరుగనున్నాయి. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వార్ల కల్యాణాన్ని తిలకించాలని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి కోరారు.

నాటుకోడి అ'ధర'హో

- భారీగా పెరిగిన ధరలు
- జిల్లాలో 44 లక్షలకు పైగా నాటుకోళ్లు
- కిలో రూ.800 ప్రకారం విక్రయం
- అమాంతం పెరిగిన గుడ్ల రేటు



నాటుకోళ్లు

నంద్యాల(అర్బన్): సాధారణంగా దసరా, సంక్రాంతి పండగకు నాటు కోడి ధర పెరుగుతుండేది. ప్రస్తుతం నాటుకోడి డిమాండ్ ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాటి పెంపకం అధికమైంది. నాటుకోడి లైవ్ ధర రూ.550 పలుకుతుండగా కిలో మాంసం రూ.750 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

కరోనా లాక్ డౌన్ నుంచి..

కరోనా లాక్‌డౌన్ ఏర్పడిన నాటి నుంచి నాటుకోడి మాంసం, గుడ్లపై ప్రజలు దృష్టి సారించారు. వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటే కరోనా రాదని నిపుణులు తెలియజేయడంతో పాటు మాంసం, గుడ్లు, చేపలు తీసుకోవాలని సూచించారు. దీంతో ప్రజలు నాటుకోడి, గుడ్లు, పొట్టేళ్ల మాంసం వైపు మళ్లారు. గతంలో పొట్టేలు మాంసం రూ.700 ఉండగా ప్రస్తుతం రూ.800 నుంచి రూ.850 మధ్య విక్రయాలు సాగుతున్నాయి. గతంలో కిలో నాటు కోడి లైవ్ మాంసం ధర రూ.500 ఉండేది. ఇప్పుడు రూ.600కు చేరింది. మామూలు నాటుకోడి ధర కిలో రూ.700 నుంచి రూ.750 మధ్యలో అమ్ముతున్నారు. నాటు కోడి గుడ్లు లభించడం గగనమైంది. ప్రస్తుతం నాటు కోడిగుడ్డు ఒకటి రూ.10 పలుకుతుంది. నాటుకోళ్లు నాలుగు నుంచి ఆరు నెలల వ్యవధిలో పెరుగుదలకు వచ్చి విక్రయాలకు అనువుగా మారుతాయి. నాటుకోడి పెంపకాన్ని పల్లెల్లో ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.

కల్తీ మాంసం విక్రయాలు..

పట్టణ ప్రాంతాల్లో పలు చికెన్ సెంటర్ల వద్ద బ్రాయిలర్‌తో పాటు నాటుకోడి మాంసం విక్రయాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. కిలో నాటుకోడి మాంసం రూ.700 నుంచి రూ.750 ప్రకారం విక్రయిస్తున్నాయి. అయితే కొందరు నాటు కోడి మాంసంలో బ్రాయిలర్ కోడి మాంసం కలిపేయడం, మరికొన్ని చోట్ల క్రాస్ నాటుకోడి మాంసం కలిపి అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్నారు. కల్తీ బారి నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు పల్లెల బాట పడుతున్నారు.

నాటుకోళ్ల పెంపకంతో ఉపాధి



చిన్న కుటీరంలో నాటుకోళ్ల పెంపకాన్ని సాగిస్తున్నా. నా వద్ద దాదాపు 120 కోళ్లు ఉన్నాయి. అందులో 60 శాతం పెట్ట కోళ్లు ఉన్నాయి. రోజుకు 55 గుడ్లు పెడతాయి. గుడ్లను అమ్మకాలకు పెట్టకుండా పొదిగిస్తూ పిల్లల పెంపకం చేపడుతున్నాం. నాటుకోళ్ల పంపెకంతో తమ కుటుంబానికి ఉపాధి దొరుకుతుంది. కోళ్లకు పెట్టే దాణాతో ఒక్కో కోడి 6 నుంచి 8కేజీల వరకు తూకం వస్తాయి. 6కేజీల కోడి రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముతున్నాం.

– రమేష్, నాటుకోళ్ల పెంపకం దారుడు, నంద్యాల.



చాగలమర్రిలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డలో భారీ మెజార్టీతో గెలుపొందుతాం

చాగలమర్రి: ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందబోతున్నాడని, అలాగే రాష్ట్రంలో జూన్ 9న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు నిలిచి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో మరోసారి తమ పార్టీ సునామి సృష్టించనుందని చెప్పారు. దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవడం ప్రతిసారి సాధ్యం కాదని ఈ సారి చంద్రబాబుకు ప్రజలు గట్టిగా ఓటు రూపంలో చెప్పారని అది వచ్చే నెల4న బయటపడుతుందన్నారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని కుతంత్రాలకు పాల్పడిన టీడీపీని ప్రజలు గుర్తించి మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడంతో అక్కసుతో రాష్ట్రంలో విధ్వంసకాండకు తెర తీశారని మండిపడ్డారు. తమకు అనుకూలమైన అధికారులను అడ్డుపెట్టుకొని పల్నాడులో హింస రగిల్చారని, అయినా తమ పార్టీ శ్రేణులు సంయమనం పాటించడం సంతోషకరమన్నారు. జి.గణేషరెడ్డి, వెంకటరమణ, జి.ఇబ్రహీం, శేషురమేష్, పత్తినారాయణ, గోవిందయ్య, ముల్లా.ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పుల్లా నరసింహులు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేశారని, పోరాటాల్లో ముందుండి నడిపించారని కొనియాడారు. మతోన్మాద రాజకీయాన్ని, కార్పొరేట్ ఆదిపత్యాన్ని ఎదుర్కోవడాన్ని నూతన సంస్కృతిని ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకువాలన్నారు. వెంకట లింగం, గౌస్, శివ, జైలాన్, సుబ్బారావు, సాయి, కృష్ణ, రామరాజు, హరి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: వరుస సెలవులు, ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులతో మహానంది క్షేత్రం కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. వారం రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీలకు డిమాండ్ నెలకొంది. లాడ్జీల నిర్వాహకులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, దేవదాయశాఖ అధికారులు స్పందించి నిర్ణీత ధరలు ఏర్పాటు చేసి లాడ్జీల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉరుములు..మెరుపులతో వాన



ఆదివారం సాయంత్రం రుద్రవరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాదాపు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు శ్రీరంగాపురం, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, అప్పనపల్లె, రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం తదితర గ్రామాల్లోని కాలనీలు, ప్రధాన రహదారులపై వర్షపు నీరు పారింది. సాయంత్రం 6 గంటల సమయంలో చల్లటి ఈదురు గాలులతో మొదలై.. ఉరుములు, మెరుపులు వర్షం కురిసింది. ఇప్పటికే రెండు మూడు విడతలుగా వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అధిక శాతం మంది ముందస్తు పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

20 ఏళ్ల తరువాత..

నంద్యాల(అర్బన్): ఇరవై ఏళ్ల క్రితం వారంతా పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో చదివారు. ఆ తరువాత ఎవరి దారుల్లో వారు వెళ్లిపోయారు. అందరూ ఓ సారి కలుద్దామని నిర్ణయించుకున్నారు. ఇందుకు మండలంలోని పోలూరు గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 2004–05 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అపూర్వంగా సాగింది. పూర్వ విద్యార్థులు సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నందయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో పాఠశాల ఆవరణంలో దాదాపు 50 మంది కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ, నాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషంగా గడిపారు.

మద్దిలేటయ్యను దర్శించుకున్న జేసీ



దర్శనం అనంతరం జేసీ దంపతులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా జేసీకి ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్ర పటం అందజేసి, శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉయ్యాలవాడ శివారులో నిండిన సుబ్బారెడ్డి కుంట



పాంపల్లె రహదారిలో వర్షపు నీటితో నిండిన రామయ్య కోనేరు

కుంటలకు జలకళ

ఉయ్యాలవాడ: ఇటీవల కురిసిన భారీ వర్షంతో కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మండల పరిధిలోని ఆర్.పాంపల్లె, హరివరం, ఉయ్యాలవాడ, కొండుపల్లె, కాకరవాడ తదితర గ్రామాల్లో బాటసారుల కోసం, పంటపొలాల్లో రైతుల అవసరాల కోసం నిర్మించిన కుంటలు వర్షపు నీటితో నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి.